విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

రెండు గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండలం గొట్లాం, సూది వలస గ్రామాల్లో ఆదివారం డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ముందుగా గొట్లాం గ్రామంలో 20 లక్షల రూపాయల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్లు కాలువలను ప్రారంభించారు. సూది వలస గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, జల్ జీవన్ మిషన్ ద్వారా 61 లక్షలు రూపాయలతో ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ అభివృద్ధికి చిరునామాగా మాడుగుల నియోజకవర్గాన్ని తయారు చేశానని అన్నారు. ప్రతి మారుమూల గ్రామాలను కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. అనంతరం గ్రామంలో కిలపర్తి నాయుడు సమకూర్చిన చీరలను రాధాకృష్ణ కోలాటం, సీతారామ కోలాటం గ్రూపులకు మంత్రి ముత్యాల నాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్, జెడ్పీటీసీ ఈర్లే అనురాధ, స్థానిక సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వ్రరి రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత అడుగులు

విశాలాంధ్ర - భీమిలి: ఓ.. యువతా మేలుకో నవ భారత నిర్మాణానికి పూనుకో వంటి ఆదర్శనీయమైన సూక్తులతో యువతలో ప్రేరణకు నాంది పలికిన స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని నేడు భీమిలి యువత వేస్తున్న అడుగులు అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి మెయిన్ రోడ్డు శివాలయం వద్ద, జూనియర్ కాలేజ్ రోడ్డు, కొన్ని ప్రాంతాల్లో వాహనాలు వేగాన్ని అదుపుచేయడం కోసం అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేశారు. స్పీడ్ బ్రేకర్లు అయితే వేశారు గాని తరచూ ఆ దారిలో వెళ్లే వాహనదారులకు అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయన్న సంగతి తెలియకపోవడంతో తరచూ ప్రమాదాలకు గురికావడం స్థానికులను కలవరపరిచింది. స్పీడ్ బ్రేకర్లు వేసిన అధికారులు వైట్ షేడింగ్ వేయడం మరిచారో..? ఎందుకులే అనుకున్నారో..? తెలియదుగాని స్థానిక యువతను మాత్రం ఆలోచనకు గురిచేసింది.

ప్రమాదాల నియంత్రణకు ఏదైనా చేయాలనే తాపత్రయంతో భీమిలిలో కొత్తగా వేసిన స్పీడ్ బ్రేకర్లకు వైట్ షేడ్స్ వేయాలనుకుంటున్నామని స్థానిక తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు గంటా నూకరాజుతో కొంతమంది యువత సంప్రదించగా అందుకు సానుకూలంగా స్పందించారు.

ఈ సందర్భంగా కాసరపు పైడిరాజు మాస్టర్, కందివలస శ్రీను మాస్టర్, వాసుపల్లి శ్రీను, ధోని రాజు, వీరుపిల్లి రాజు, చింతకాయల రాజు, మూర్తి, వాసుపల్లి వంశీలను గంటా నూకరాజు అభినందించారు.

పండగ మీకు.... పస్తులు మాకా...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అంగన్‌వాడీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ జరుగుతున్న సమ్మె 34వ రోజుకు చేరుకుంది. ఆదివారం ఖాళీ గిన్నెలు కంచాలతో మోత మోగిస్తూ పండగపూట "పస్తులు మాకు - పండగ మీకు" అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వీరికి సంఘీభావంగా సీపీఎం కార్పొరేటర్ డా.బి.గాంగారావు, బొట్టా ఈశ్వరమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎం శ్రీనివాస్, ఆర్కేఎస్‌వి కుమార్, పి.వెంకటరెడ్డి, వి.కృష్ణారావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ తదితరులు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అతి దారుణంగా అంగన్వాడీలపై వ్యవహరిస్తోందన్నారు. అంగన్వాడీ సెంటర్స్ తాళాలు పగలు కొట్టడం, సచివాలయం సిబ్బందితో పనిచేయించడం, ఇప్పుడు విధుల నుండి తొలగిస్తామని బెదిరించడం, ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం వంటి చర్యలకు పాల్పడడం దారుణమన్నారు. అంగన్వాడీలను బెదిరించి, భయపెట్టి ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తులసి, వెంకట లక్ష్మి, నాగేశ్వరి, శోభ, కృప, శాంతి, సుజాత, పూజిత, దేవి, విజయ, రామలక్ష్మి, శ్యామల తదితరులు పాల్గొన్నారు. వీరి పోరాటానికి న్యాయవాదులు మద్దతు తెలిపి 5000/రూ పోరాట నిధి ఇచ్చారు.

34వ రోజు అంగన్వాడీ సమ్మె

పరవాడ: చర్చల పేరుతో కాలయాపన చేయడమే కాకుండా ఎస్మాను ప్రయోగించి అంగన్వాడీలపై బెదిరింపులకు దిగడం దుర్మార్గమని అంగన్వాడీలు మండిపడ్డారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. ఈ సంధర్భంగా పరవాడ తహశీల్ధారు కార్యాలయం ఎదుట అంగన్వాడీలు బోగి మంట వేసారు. ఆ భోగిమంటలో ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులతో పాటు జీవో నెంబర్ 2 ప్రతులను దగ్ధం చేసి నిరసనలు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. గ్రాట్యూటీ అమలు, కనీస వేతనాలు పెంచే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. సంక్రాంతి తర్వాత ప్రభుత్వం దిగిరాకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్దమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, అంగన్వాడీ లీడర్లు సీహెచ్.దేవి, ఎం.రమణి, ఎస్.పార్వతి, రామలక్ష్మి, అరుణ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కళ్యాణం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో పలు గ్రామాల్లో గోదాదేవి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం ఎస్. రాయవరంలో వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయం, గుడివాడ గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం పేట సూది పురం, వమ్మవరం గ్రామాల్లో ఉదయము గోదాదేవి కళ్యాణం సందర్భంగా దంపతులు వచ్చి కళ్యాణం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ రాయవరం ఆదివారం సాయంత్రం స్వామివారి ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మాజీ మంత్రి, విశాఖ ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు కు జాతీయ రహదారి స్థానిక వై జంక్షన్ వద్ద నాయకులు ఘనంగా సన్మానించారు. విశాఖ నుంచి భీమవరం వెళుతున్న గంటా శ్రీనివాసరావును మాజీ వైస్ ఎంపీపీ గొర్రెల రాజబాబు, తుని, పాయకరావుపేట తాపీ పనివారుల సంఘం అధ్యక్షులు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లపల్లి నాగు, భజంత్రీలు శివ, కోడూరు నూకరాజు, గంట థామస్, విశ్వనాధుల బాబ్జి, రాజు, నారాయణ, నాగు, మనీష్ , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర - పాయకరావుపేట: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎస్. నర్సాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో డొక్కా సీతమ్మ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ ప్రీమియం లీగ్ టోర్నమెంట్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ గొర్రెల రాజబాబు ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు విద్యతో పాటు మానసిక ఆరోగ్యం కొరకు క్రీడలు చాలా ముఖ్యమని తెలిపారు. యువత సెల్ ఫోన్లు వదిలి స్వచ్ఛమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పల్లెల మణికంఠ స్వామి, గొల్లపల్లి నాగు, తలారి రాజా, రమణ, బెన్నరాజు, నిర్వాహకులు రమణ, నాని, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూడిమడకలో దాహం కేకలు

విశాలాంధ్ర - అచ్యుతాపురం : మత్స్యకార గ్రామమైన పూడిమడక శివారు కొండపాలెం గ్రామంలో ప్రజలు తాగునీటి కోసం కటకటలాడుతున్నారు. వారం రోజుల నుండి గుక్కెడు మంచినీళ్ల కోసం పడరాని పాట్లు పడుతున్నామని, పండగపూట కూడా మంచినీళ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు తెలిపిన ఫలితం లేదని, గత్యంతరం లేక శుద్ధజలాలు కొని తాగవలసిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ సమయంలో మంచినీళ్లు లేక అల్లాడిపోతున్నామని వాపోతున్నారు. పూడిమడక గ్రామం పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా తయారైందని ప్రజలు అధికారులపై, ప్రజాప్రతినిధులపై మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పండుగ సమయంలో మంచినీరు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

అరకులోయలో పర్యాటకుల సందడి

విశాలాంధ్ర - అరకులోయ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్ర ఊటీ అందాల అరకులోయకు పర్యాటకులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో అరకులోయ అందాలను వీక్షించడానికి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. శని, ఆదివారం వీకెండ్‌ను ఎంజాయ్ చేయాలన్న తలంపుతో వివిధ రాష్ట్రాల నుండి దేశాల నుండి కుటుంబాల సమేతంగా అరకులోయకు తరలివచ్చారు. దీంతో అరకులోయ పరిసర ప్రాంతాలన్నీ సంక్రాంతి సందడి సందడిగా మారాయి. ప్రధానంగా చాపరాయి జలపాతం, గిరిజన సంస్కృతిక మ్యూజియం, గాలికొండ వ్యూ పాయింట్, సుంకరమెట్ట కాఫీతోటలు, తాడిగూడ జలపాతం తదితర ప్రాంతాలలో పర్యాటకులతో సందడి కనిపిస్తుంది. అయితే ఈ ఏడాది డిసెంబర్ నెలలో నుండి పర్యాటకులు అరకులోయకు అధిక సంఖ్యతో విచ్చే స్తున్నారు. అరకులోయ పరిసర ప్రాంతాల అందాలను ఆస్వాదనకు సందర్శకులు తరలి వస్తున్నారు. ఈ కారణం వలన విశాఖ అరకులోయ ఘాట్ రోడ్ శివలింగపురం నుండి అరకులోయ పట్టణం వరకు వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగు తుండడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అయింది. ప్రధానంగా గాలికొండ వ్యూ పాయింట్ వద్ద వందలాది వాహనాలు రహదారిపైనే నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్య ఎలా ఉన్నప్పటికీ చాలా నెలల తర్వాత అరకు లోయకు కొత్త కళ వచ్చి పడిందని చెప్పవచ్చు. వాతావరణ పరిస్థితులు కూడా అనుకూలంగా ఉండడంతో పర్యాటకులు ఎక్కడికక్కడ సేదతీరుతూ ఆహ్లాదం పొందుతున్నారు. చిన్నపిల్లఅనే తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరు అరకులోయ అందాలను ఆస్వాదిస్తూ హాయ్ హాయిగా గడుపుతున్నారు. కాగా పర్యాటకుల తాకిడి పెరగడంతో ఆటోవాలాలు, కార్లు, జీపులు యాజమాన్యం చిల్లర వర్తకులు లాడ్జి యాజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.చాలా రోజులుగా వ్యాపారాలు లేక పర్యాటకుల కోసం ఎదురు చూస్తున్నామని కార్తీక మాసం పుణ్యమా అంటూ పర్యాటకుల తాకిడి పెరగడంతో వ్యాపారాలు జరుగుతున్నాయని వారంతా చెబుతున్నారు. ఈ సీజన్ ఇలాగే కొనసాగితే మా కష్టాలు అప్పులు తీర్చుకో కలుద్దామని వారు చెబుతున్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారు కొలువై ఉన్న సింహాద్రిపై సంక్రాతి సంబరాలు అంబరాన్ని అంటాయి. తొలిరోజు భోగి పండుగలో విశాఖ శారద పీఠాదిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తర పీఠాధిపతి స్మాత్మా నందేంద్ర సరస్వతి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి ఎస్ శ్రీనివాసమూర్తి పాల్గొని భక్తులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు సంక్రాతి సంబరాలను చూడటానికి విచ్చేసారు. భోగి మంటను అంటించి సంబరాలను స్వామిజి ప్రారంభించారు. ఈఓ ఆదేశాల మేరకు గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే తరహాలో దేవస్థానం అధికారులు సింహగిరి వీధులను అలంక రించారు. ఒకవైపు గోసంతతి, మరోవైపు విశేష పంటలు, ఎండుగడ్డి మేటలు, ఎడ్లబళ్ళు, తప్పెట గుళ్ళ కోలాహలం, గంగిరెద్దుల విన్యాసాలు, కొమ్మ దాసరుల చమత్కారాలు, రంగవల్లుల వరుసలతో సింహగిరి శోభాయమానంగా దర్శన మిచ్చింది. సంక్రాంతికి సింహాచలం దేవస్థానం వారు పిండివంటలు బూరెలు, పొంగలి, పులిహోరను వంచిపెట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం అధికారులు, పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు తమ తొలిపంట చేతికొచ్చిన ఆనందంలో రైతులు కొంత పంటను సింహాద్రి అప్పన్నకు సమర్పించారు.

చట్టాలు రద్దు చేయకపోతే 17న శంఖారావం

విశాలాంధ్ర - ఆనందపురం: దేశవ్యాప్తంగా లారీ డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జీవో నెంబర్ 106(2) వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆదివారం బీపీ కల్లాలు శుభశ్రీ ఫంక్షన్ హాల్లో విశాఖపట్నం జై హెూ రథసారథి డ్రైవర్స్ క్లీనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఓలేటి వాసు మాట్లాడుతూ దేశంలో అనేక రకాలైన సేవలను డ్రైవర్లు అందిస్తున్నప్పటికీ వారికి ఎటువంటి భరోసా ఇప్పటివరకు ఏ కేంద్ర ప్రభుత్వం కూడా కల్పించలేకపోయిందని అలాగే దేశ ఆర్థిక వ్యవస్థకు ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ మూలమని, లారీ డ్రైవర్లకు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి రిటైర్ అయిన వారికి పెన్షన్ అందించి ఆ కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అలా కాకుండా కొత్తగా కేంద్ర ప్రభుత్వం జీవో నెంబర్ 106(2) తీసుకొచ్చి రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఏడు లక్షలు అపరాధ రుసుము చెల్లించడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రమాదాలు జరిగేటప్పుడు డ్రైవర్లను బాధ్యులు చేయడం సరికాదని, వెంటనే నూతన జీవోను రద్దుచేసి లారీ డ్రైవర్లకు అండగా ఉండాలని లేని పక్షంలో జనవరి 17 నుంచి దేశవ్యాప్తంగా లారీ డ్రైవర్లు అందరూ డ్రెస్ కోడ్‌లో బంద్‌ను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జయహెూ రథసారథి అసోసియేషన్ కార్యదర్శి భూపతి రాజు, ట్రెజరర్ కేసరి కుమారి, విశాఖ జిల్లా ఇన్చార్జులు రామకృష్ణ, మాణిక్యం, దుర్గారావు, ఆనందపురం మండలం లారీ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు గంట్రెటి సూర్యనారాయణ, కార్యదర్శి పూడి అప్పారావు, కోశాధికారి పైడినాయుడు, కిలాని శ్రీను, అప్పలనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు కత్తితో హల్‌చల్

విశాలాంధ్ర - హుకుంపేట: మద్యం మత్తులో యువకుడు కత్తి పట్టుకొని హల్ చల్ సృష్టించాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో ఆదివారం ఒక యువకుడు మద్యం సేవించి రహదారిపై వాహనాలపై వెళ్తున్న వాహన చోదకులపై కత్తితో దాడి చేస్తూ వీరవిహారం సృష్టించాడు. యువకుడి చేతిలో కత్తి పట్టుకొని తిరగటంతో ప్రజలు భయాందోళనతో పరుగులు తీశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ ఐ సతీష్ కత్తి పట్టుకొని యువకుడు స్థానిక మద్యం దుకాణం వద్ద ఉన్నట్లు తెలుసుకొని అక్కడికి పోలీస్ బలగాలతో వెళ్లాడు. అప్పటికే మద్యం దుకాణం వద్ద భారీ గొడవ జరిగిందని కత్తి పట్టుకొన్న యువకుడు మరో యువకుడిని గాయపర్చాడని పలువురు తెలిపారు. కత్తి పట్టుకొన్న యువకుడి వద్ద నుంచి కత్తి తీసుకోనే ప్రయత్నించగా యువకుడు కత్తి ఇవ్వకపోగా తనను ఎవ్వరైనా పట్టుకుంటే వారిని నరికేస్తానంటూ అనటంతో ఎవ్వరు దగ్గరకు వెళ్లాటానికి ధైర్యం చేయలేదు. దీంతో పోలీసులు ఎస్ఐ యువకుడిని నడిపించుకుంటూ పోలీస్ స్టేషన్‌లో తీసుకెళ్లారు. గాయాలైన యువకుడిని ఆసుపత్రికి పోలీసులు తరలించారు. కత్తి పట్టుకొని వీరంగం సృష్టించిన యువకుడి పేరు శ్రీకాంత్ అని ములియాపుట్టు గ్రామంగా పలువురు తెలిపారు. గాయపడిన మరో యువకుడిది బాబీ పాడేరు వాసీగా పలువురు యువకులు తెలిపారు. మండల కేంద్రంలో గత రెండు రోజుల నుండి రాత్రిపూట యువకులు మద్యం మత్తులో కత్తులతో వీరంగం సృష్టిస్తున్నట్లు స్థానికులు చెప్తున్నారు. వైన్ షాప్‌లోనే మందు కొనుక్కొని అక్కడే త్రాగి మాట మాటకు పెరిగి గొడవలు జరుగుతున్నాయని ఇవే కాకుండా వారపు సంతల్లో దొంగతనాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పలు గ్రామాల్లో కోడి పందేలు, పేకాటలు, జూదాలు జరు గుతున్న స్థానిక పోలీస్‌లు పట్టించు కోకపోవడం కారణంగానే ఇలాంటి సమస్యలు పునరావృతం అవుతున్నాయని మండల వాసులు పలువురు ఆరోపిస్తున్నారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం

విశాలాంధ్ర - చింతపల్లి: పార్టీ కోసం పనిచేసిన వారికి వైకాపాలో సముచిత స్థానం దక్కుతుందనడానికి ప్రత్యక్ష ఉదాహరణగా మత్స్యరాస విశ్వేశ్వర రాజును చెప్పుకోవచ్చని ఆ పార్టీ కిటుముల పంచాయతీ నాయకులు అన్నారు. వైకాపా పాడేరు సమన్వయకర్తగా నియమితులైన మత్స్యరాస విశ్వేశ్వర రాజును పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాడేరు నియోజకవర్గంలోని పరిస్థితులు, కిటుముల పంచాయతీలో నెలకొన్న సమస్యలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా ఆవిర్భావం నుంచి పార్టీని నమ్ముకుని పనిచేసిన విశ్వేశ్వర రాజును పార్టీ అధిష్టానం గుర్తించిందన్నారు. ఆయనను పాడేరు సమన్వయకర్తగా నియమించడమే గాక 2024 లో జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో పాడేరు శాసనసభకు ఆయననే అభ్యర్థిగా సూచించడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. సమన్వయకర్తగా నియమితులైన ఆయనను భోగి సందర్భంగా కలసి పార్టీ పరిస్థితులపై చర్చించడమే కాకుండా మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియపరచడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కిటుముల పంచాయతీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి సీపీఐ కార్యాలయంలో విశాలాంధ్ర దినపత్రిక 2024 క్యాలెండర్‌ను ఆదివారం సీపీఐ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాండ్రేగుల సత్యాంజనేయ, గుడాల రాంబాబు, సీనియర్ నాయకులు నూనెల సూరిబాబు, ఐఎన్‌టీయూసీ నాయకులు బోగ వెల్లి నాగభూషణం, టీడీపీ నాయకులు మజ్జి సోమేష్, వార్డ్ మహిళా అధ్యక్షురాలు సర్వశుద్ధి శ్రీ లక్ష్మి దంపతులు, నమ్మి అప్పల సత్యనారాయణ, ఊరుకుటి మహేష్, సిపిఐ సీనియర్ నాయకులు గండ అప్పారావు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మీనా రిసార్ట్

విశాలాంధ్ర - చింతపల్లి: ఆంధ్ర కశ్మీర్ లంబసింగి ప్రాంతంలోని లంబసింగి, లబ్బంగి గ్రామాల సమీపంలో గల మీనా రిసార్ట్స్ అందుబాటులోకి వచ్చిందని ఆ రిసార్ట్స్ యజమానురాలు బారంగి మీనాక్షి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ గడచిన కొన్నేళ్లుగా పర్యాటకులకు చిరపరిచితంగా ఉన్న మీనా రిసార్ట్స్ గడచిన ఆరు మాసాలుగా పలు అనివార్య కారణాల వలన మూసివేయడం జరిగిందన్నారు. మరల ఈ రిసార్ట్ అందుబాటులోకి వచ్చిందని, ఎప్పటి మాదిరిగానే పర్యాటకులు మీనా రిసార్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఘనంగా అయ్యప్ప స్వామి ఊరేగింపు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం పాకలపాడు గ్రామంలో గల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి అయ్యప్ప ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భోగి పండుగ కావడంతో వేకువ జామునే భక్తులు అయ్యప్ప స్వామి వారికి స్థానిక రామాలయం వద్ద అష్టోత్తర పూజలు, అభిషేకములు నిర్వహించారు. వాహనంపై ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉత్సవమూర్తిని ఉంచి గ్రామ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. అయ్యప్ప భక్తులు నృత్యాలు, శరణుఘోషతో గ్రామం మారుమోగింది. ఈ సందర్భంగా అయ్యప్ప సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగా జ్యోతి స్వరూపుని ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని సంవత్సరం పొడవునా గ్రామంలో స్వామివారి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమన్నారు.

లైఫ్ అఫ్ గివింగ్ సేవా సంస్థ సేవలు అమోఘం

విశాలాంధ్ర - కశింకోట: లైఫ్ ఆఫ్ గివింగ్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్దఎత్తున యువత విచ్చేసి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. సంస్థ సభ్యులు మాట్లాడుతూ సేకరించిన మొత్తం రక్తాన్ని అమ్మ బ్లడ్ బ్యాంక్ గాజువాక వారికి ఇవ్వడం జరిదన్నారు. అలాగే లైఫ్ ఆఫ్ గివింగ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో చేసే ప్రతీ కార్యక్రమానికి ప్రత్యక్షంగా పరోక్షంగా సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

శ్రీదానప్ప తల్లి అమ్మవారి చీరల పంపిణీ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో గల వడ్లపూడి ఆర్‌హెచ్ కాలనీ దుగ్గపువానిపాలెం గ్రామంలో వెలసి ఉన్న శ్రీశ్రీశ్రీ దానప్పతల్లి అమ్మవారి చీరలు పంపిణీ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతి ఎట భోగి రోజున నిర్వహించే పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఈ సంవత్సరం మొత్తం మీద వచ్చే చీరలను సుమారుగా 680 పేద ప్రజలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సరళ కొండలరావు, డివి అప్పారావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, ప్రగడ శంకర్రావు, బొడ్డ సన్యాసిరావు, ప్రగడ అప్పలనరసయ్య, పిన్నింటి సంతోష్, ప్రగడ శ్రీనివాస్, ఎస్.దానయ్య, ప్రగడ గోవిందరాజులు, దుగ్గపు వెంకటరమణ, కేవీ నారాయణ, ప్రగడ రాము, ఎస్.దానయ్య, డి.దానప్పలు, డి.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

జగన్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేకుపల్లి జంక్షన్‌లో 34 రోజులుగా నిరసన దీక్ష చేస్తున్న అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే జగన్ ప్రభుత్వానికి తప్పదని జిల్లా సహాయ కార్యదర్శి పూణెం సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రేఖపల్లి వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో నిరహారదీక్ష చేస్తున్న అంగన్‌వాడీలకు, మిడ్డే మీల్స్ అంగన్‌వాడీలను గుర్రాలతో తొక్కించిన చంద్రబాబు పదేళ్ల ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చిందన్నారు. ఈరోజుకి కూడా ఆ ఘటనలు చంద్రబాబును వెంటాడుతున్నాయని గుర్తు చేశారు. సిఐటియు జిల్లా నాయకులు. జిల్లా సభ్యులు సున్నం రంగమ్మ , మండల అధ్యక్షులు నాగమణి మాట్లాడుతూ 34వ రోజుకు చేరిన అంగన్‌వాడీలు దీక్ష శాంతియుతంగా ఆందోళనలు సాగుతున్నా కళ్లుండి చూడలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. యూనియన్ ప్రతినిధులను చర్చలకు పిలుస్తున్న మంత్రుల బృందం అంగన్‌వాడీలకు ఇస్తున్న వేతనాలపై అసత్యాలను చెబుతున్నారని మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇవ్వని విధంగా జీతాలను ఇస్తున్నామని వాస్తవాలను వక్రీకరించేలా ప్రభుత్వం ప్రకటనలు చేస్తుందని మండి పడ్డారు. అంగన్‌వాడీల డిమాండ్లను నెరవేర్చినట్లు మీడియాకు మంత్రి బొత్స సత్యనారాయణ అవాస్తవాలను చెప్పడం సరికాదన్నారు. అంగన్వాడి యూనియన్ మండల అధ్యక్షలు ,కార్యదర్శిలు. మాట్లాడుతూ, ఇప్పటివరకు అంగన్వాడీల సమ్మె శాంతియుతంగా పోరాటం సాగిందని,ఇకపై అంగన్‌వాడీల సత్తా ఏంటో జగన్ రెడ్డి ప్రభుత్వానికి చూపిస్తామని హెచ్చరించారు,ఇప్పటి వరకూ ఎంతో సహనంతో ఉద్యమాన్ని చేశామని, ఇకపై జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహిం చాల్సివుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ అంగన్వాడీలు, మిడ్డేమీల్స్ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ గ్రౌండ్స్‌లో జీవిఎల్ సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విశాఖపట్నం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో బిజెపి ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఎంతో ఘనంగా 12 తేదీ నుండి 15 వరకు నిర్వహిస్తున్న జీవీఎల్ మహా సంక్రాంతి సంబరాలు భోగీ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రముఖ నటుడు సాయి కుమార్‌తో కలిసి గంగిరెద్దుల సందడి, హరిదాసుల కీర్తనలు, గిరిజన సంప్రదాయ దింశ నృత్యం, సంప్రదాయ మేళ తాళాలు, రంగుల రంగవల్లులు తో, వీటి నడుమ ఆవు పిడకలు తో భోగి మంట వేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి జీవీఎల్ మాట్లాడుతూ తెలుగు ప్రజలకు భోగీ శుభాకాంక్షలు తెలిపారు. విశాఖ వాసుల కోసం ఎంతో ఘనంగా చేస్తున్న ఈ సంబరాలకు అశేష జనం రావటం సంతోషం గా ఉందన్నారు. వేడుకగా భోగిపళ్ళ సంబరాలు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం జరిగిన బోగి పళ్ళు వేడుకల్లో కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాలా పాల్గొని చిన్న పిల్లలకి భోగి పండ్ల తో స్నానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు భోగి పండ్ల స్నానం అనేది దేశం మొత్తం మీద ఎక్కడ లేదు, ఒక ఆంధ్రప్రదేశ్ (తెలుగు వారు) లో మాత్రమే కనిపిస్తుందన్నారు. చిన్న పిల్లలకి బోగి పండ్ల తో స్నానం చాలా మంచి సంప్రదాయం అని, సంస్కృతి సంప్రదాయాల్లో మన దేశం ప్రపంచంలో ముందుందన్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది మన దేశమే అని, తల్లి తండ్రులు,అన్నదమ్ములతో ఎలా ఉండాలో శ్రీ రాముడు మనకు నేర్పించారన్నారు. బజన గీతాలు పాడుతూ ప్రజలను ఆకట్టుకున్నారు. మన సంస్కృతి సంప్రదాయాలే మనదేశాన్ని ప్రపంచదేశాలకు ఆదర్శంగా నిలిపాయన్నారు. విశ్వ గురువుగా అవతరించేందుకు అడుగులు వేయడానికి కూడా కారణమైందని, ప్రపంచ సంస్కృతిక నాయకత్వాన్ని మనదేశం కలిగివుందన్నారు. యోగాలో మన ఖ్యాతి విశ్వవ్యాప్తమైందని, అలాగే అంతరిక్ష పరిశోధనల్లో మనదేశమే అగ్రస్థానంలో వుందన్నారు. భావిభారతానికి బలమైన పునాదులు మన సంస్కృతి సంప్రదాయాలతోనే ముడిపడి వుందని, ఇది ఎప్పటికీ జ్ఞప్తికి వుంచుకోవాలన్నారు. భావిభారత పౌరులకు మన వారసత్వ సంపదను చాటి చెప్పేవి మన పండుగలే అని, అయోధ్య రామమందిర నిర్మాణం 500 ఏళ్ల నాటి అడ్డంకులను అధిగమించిందని ఎట్టకేలకు దేశవ్యాప్తంగా ఒక పండుగ వాతావరణం మొదలైందన్నారు.

సూరకుంటలో సాంస్కృతిక - రాజ్యాంగ హక్కులపై అవగాహన

విశాలాంధ్ర - చింతూరు: గొటుల్ - గోండ్వాన అధ్యయన కేంద్రం సూరకుంట ఆధ్వర్యంలో గొటుల్ జట్ నేతృత్వంలో ఆదివారం పేగ పంచాయితీ స్థాయిలో సాంస్కృతిక - రాజ్యాంగ హక్కుల అవగాహనా మనుగడ అంశాలపై గొటుల్ - వర్క్ షాప్ నిర్వహించారు. ఆదివారం విద్యాభివృద్ధి - ఉన్నత విద్య ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహనా కల్పించారు. ఇందులో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చిదాం కిషోర్ విద్యాభివృద్ధి - ఉన్నత విద్య ఆవశ్యకత గురించి మాట్లాడుతూ స్థానికంగా ప్రాథమిక విద్య శాతం పెరుగుతున్నప్పటికీ మెరుగైన ఫలితాలు సాధించడం అలానే ఉన్నత విద్య లో మాత్రం వెనుకబడే ఉన్నామన్నారు. మెరుగైన ఫలితాలు సాధించక పోవడం కారణంగా మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నత విద్యా అవకాశాలు కోల్పోతున్నామని తెలిపారు. విద్యార్థులందరూ భయం వదిలేసి ఇంటర్లో ఇంగ్లీష్ మీడియంలో చదివేందుకు చొరవ తీసుకోవలసిందిగా కోరారు. భిన్నమైన ఆధునిక అవకాశాలు అందిపుచ్చుకునే విద్యని అభ్యసించేందుకు చొరవ తీసుకోవలసిందిగా సూచించారు. యూనివర్సిటీ స్థాయి లో ఉన్నత విద్య కోసం అలానే కెరీర్ గైడెన్స్ ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. స్థానిక ఎఫ్. ఎస్. ఓ. తొడం దేశయ్య పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడుతూ ఆదివాసీ జీవన విధానంలో అద్భుతమైన పర్యావరణ పరిరక్షణ ఉందని, రోజు రోజుకీ ఆదివాసీ జీవనం దుర్భరమౌతున్నట్టే పర్యావరణం కూడా ప్రమాదకరంగా మారుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ భాధ్యత ఆదివాసీలదే కాదు మనుషులందరిదనీ పేర్కొన్నారు. మానవుల సౌకర్యవంతమైన జీవనం కోసం విపరీతమైన ప్లాస్టిక్ వాడకం, విషతుల్యమైన కాలుష్యంతో పర్యావరణం జీవించలేని విధంగా తయారవుతోందని అందుకే పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గొటుల్ ఫౌండర్ డైరెక్టర్ మడివి నెహ్రూ, అధ్యక్షులు వీసాల శ్రీలక్ష్మి, ఏ. ఎస్. పి. ప్రచార కార్యదర్శి సోడె మురళి, పేగ సర్పంచి పాయం చంద్రయ్య, ఏ. ఎస్. ఎఫ్. కార్యదర్శి సుధీర్, లిడ్స్ డైరెక్టర్ ఫాదర్ ప్రశాంత్, సోడె లక్ష్మణ్, తోడం చంద్రయ్య, తోడం పాపారావు, తోడం రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులతో భోగి సంబరాలు ఆనందంగా ఉంది

మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గౌతమ్ నరేంద్ర మహర్షి

విశాలాంధ్ర - చింతపల్లి :- ఆంధ్ర కాశ్మీర్ లంబసింగి ప్రాంతంలోని పర్యాటక వ్యూ పాయింట్ అయిన చెరువుల వనం కొండపై నివసిస్తున్న గిరిజనులతో భోగి సంబరాలలో పాల్గొనడం సంభ్రమాశ్చర్యంగా ఉందని మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పెదిరెడ్ల గౌతమ్ నరేంద్ర మహర్షి అన్నారు. భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం చెరువుల వనం గిరిజనులకు నిత్యవసర వస్తువులు, వస్త్రములను ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా గౌతమ్ నరేంద్ర మహర్షి మాట్లాడుతూ భోగి సంబరాలు గిరిజనులతో కలిసి చేసుకోవడం చాలా గొప్ప అనుభూతినిచ్చిందన్నారు. మనం ఫౌండేషన్ ఎల్లప్పుడూ గిరిజనులకు సేవ చేస్తూ ఉంటుందని తెలిపారు. అనంతరం ఆ గ్రామ పెద్ద పాంగి లక్ష్మణ్ రావు మాట్లాడుతూ మనం ఫౌండేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినంద నీయ మన్నారు. మనం ఫౌండేషన్ కు గిరిజనులపై ఉన్న ప్రేమను మరువలేనిదని ఫౌండేషన్ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మనం ఫౌండేషన్ సభ్యులు గర్రెడ్డి హరికృష్ణ,షేక్ బషీర్ భాను, సప్ప రూపేష్, లాలం హేమంత్ , గొలుసు ప్రవీణ్, పెదరెడ్ల శ్రీకాంత్ , పెదరెడ్ల జస్వంత్,తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత ఇచ్చే పార్టీనే గెలిపిస్తాం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రానున్న ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యతను ఇచ్చి , ఎక్కువ ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని 'వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్' కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఉదయం రైల్వే న్యూ కాలనీలోని సింకా గ్రాండ్ హెరీటల్లో ముస్లిం నేత హైదర్ ఆలీ సింకా అధ్యక్షతన వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలలో ముస్లింలకు సీట్లు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయని వాపోయారు. పశ్చిమ గోదావరి జిల్లా నుండి శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న 67 నియోజకవర్గ వర్గాలలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ముస్లింలకు సీట్లు కేటాయించకుండా, ముస్లింలను ఓటు బ్యాంకుగా చూస్తూ వారిని చిన్న చూపు చూస్తున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికలలో ముస్లింలు లకు సీట్లు కేటాయించే రాజకీయ పార్టీలకు మాత్రమే ముస్లింలు మద్దతు ఇస్తారని, ఆ పార్టీల అభ్యర్థులను ముస్లింలు గెలిపించుకుంటారని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు ముస్లింలకు సీట్లు కేటాయించని పక్షంలో ముస్లింలు ఇండిపెండెంట్లు గా ఎన్నికలలో పోటీ చేస్తారని స్పష్టంచేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో ముస్లిం నేతలు న్యాయవాది షేక్ షరీఫ్, రహమతుల్లా బేగ్, షేక్ మునీర్, షేక్ అహ్మద్ వలి, హైదర్ ఆలీ సింకా, ముజీబుర్ రహ్మాన్, అమీర్ఖాన్, షేక్ నూర్ అహ్మద్, పలు మసీదుల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతలు పంపిణీ

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో పూడి ఆర్ ఆర్ కాలనీ (వైఎస్ఆర్ నగర్)లో అయోధ్య రామమందిరం నుండి వచ్చిన అయోధ్య రామయ్య అక్షింతలను సర్పంచ్ లాలం వాణి (శ్రీనివాసరావు (వాసు) ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అయోధ్య రామ మందిరం గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భోగి మంటల్లో జీవో ప్రతులు దగ్ధం

విశాలాంధ్ర-రాంబిల్లి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం "పల్లె పిలుస్తుంది రా కదిలి రా" అనే కార్యక్రమంలో భాగంగా వైసిపి ప్రభుత్వ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విడుదల చేసిన ప్రజా వ్యతిరేక పాలన జీవోలు, రద్దు చేసిన పథకాల జాబితా, అమలు చేయని హామీలు, వ్యవస్థల నిర్వీర్యం, ప్రజాస్వామ్యం లేని పాలన, అరాచకాలు, ఆకృత్యాలను, వాటి జీవో ప్రతులను రాష్ట్ర టిడిపి కార్యదర్శి మండలంలో హరిపురంలో గల ఆయన ఇంటి వద్ద భోగిమంటల్లో వేసి థగ్ధం చేసి ఈ ప్రజా వ్యతిరేక పాలన నుండి విముక్తి కలిగి, వచ్చే మూడు నెలల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి రాష్ట్ర ప్రజలందరికీ" రావణ రాజ్యం పోయి రామరాజ్యం" రావాలని కోరుకుంటూ తమ కుటుంబ సభ్యులుతో కలిసి భోగీ మంటలలో వేసి పలు జీవో ప్రతులను దగ్ధం చేసినట్లు మీడియాకి తెలిపారు.ప్రజలంతా సంక్రాంతి, కనుమ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు.

కన్నుల పండుగగా భోగి

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని ప్రజలు కులమతాలకు అతీతంగా భోగ భాగ్యాలను ఇచ్చే భోగి పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారి జామున ని లేచి చిన్న పెద్ద తేడా లేకుండా భోగి మంటలు వెలిగించి ఉల్లాసంగా భోగి పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆనందపురం గ్రామపంచాయతీ సర్పంచ్ చందక లక్ష్మి తమ పార్టీ కార్యాలయంలో భోగి మంటలు వెలిగించి అందరికీ భోగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు చందక సూరిబాబు, ప్రొఫెసర్ చందక బాబి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అనంతగిరి: బోగి మంటల్లో ముఖ్యమంత్రి జగన్ రెడ్డి జారిచేసిన ఎస్మాచట్టం, జి. ఓ నెంబర్ 2ను అంగన్వాడీ వర్కర్స్, వివిధ ఉద్యోగ సంఘాలు ప్రజాగొంతుక జడ్పిటిసి దీసరి గంగరాజు దగ్ధం చేశారు. అనంతగిరి మండలంలో అంగన్వాడీ టీచర్లు హెల్పర్లు, ఉద్యోగ సంఘాల సమ్మెకు మద్దతు తెలిపారు. జెడ్పీటీసీ దీసరిగంగరాజు మాట్లాడుతూ నేటికీ అంగన్వాడీ టీచర్లు సమ్మె చేస్తూ 34 రోజులు గడుస్తుందని అయినా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మనస్సులో ఉన్న పాత ఆలోచనలు విడిచి పెట్టి మంచి మనస్సుతో మారుమనస్సుతో అంగన్వాడీలకు సమాన పనికి సమాన వేతనం కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి.కళవతి, అంగన్వాడీ మండల కార్యదర్శి సాగర సుమిత్ర, టోకురు సర్పంచ్ కిల్లో మోస్య, అనంతగిరి మండల సిపిఎం పార్టీ కార్యదర్శి సోమెల నాగులు, అంగన్వాడీ టీచర్లు సరస్వతి, చిలకమ్మ, తులసి,కన్యాకుమారి రాజేశ్వరి అంగన్వాడీ టీచర్లు,హెల్పేర్స్ వివిధ ఉద్యోగ సంఘాలు, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరాలపై పోలీసులు ఉక్కు పాదం

విశాలాంధ్ర - ఆనందపురం: సంక్రాంతి పండగ వేళ కోడిపందేలపై ఆనందపురం మండలంలో పోలీసులు ఉక్కుపాదం మోపారు. భారీగా పందాలు నిర్వహిస్తున్న సమాచారం మేరకు పోలీసులు పందాలు నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని , 10 కోళ్లతోపాటు సుమారుగా 9వేలు కు పైగా నగదు రికవరీ చేసి పందెం రాయుళ్లు పై ఆనందపురం పోలీసులు కేసులు నమోదు చేశారు.

ఘనంగా భోగి

విశాలాంధ్ర - యస్.రాయవరం : మండలంలో భోగి పండుగ ఘనంగా జరిగింది. సంక్రాంతి సందర్భంగా తొలి రోజు భోగి పండుగ కావడంతో ప్రజలు తెల్లవారుజామున స్నానాలు ఆచరించి భోగి మంటలను వేయడం జరిగింది. అలాగే పలు గ్రామాల్లో పండుగ సందర్భంగా ముగ్గులు పోటీలు సాంస్కృతి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

గోవాడ సుగర్స్‌లో నిలిచిన క్రషింగ్

విశాలాంధ్ర - చోడవరం: గోవాడ సుగర్స్‌లో శనివారం అర్ధరాత్రి నుండి చెరకు క్రషింగ్ నిలిచిపోయింది. బాయిలర్‌లో బాడీ ఫ్యాన్, పైప్ మరమ్మత్తుల కారణంగా అధికారులు అర్ధరాత్రి రెండు గంటల నుండి క్రషింగ్ నిలిపివేశారు. సంక్రాంతి పండుగ సమయంలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేపట్టి, చెరకు గానుగాట ప్రారంభం చేయాలని ఏ.పి.రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు కోరుతున్నారు. తరచూ పలు సాంకేతిక సమస్యల తో గంటల కొద్దీ క్రషింగ్ నిలిచిపోవడం తో రైతాంగం పలు ఇబ్బందులు పడుతున్నారు.

తెలుగు ప్రజలందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు

విశాలాంధ్ర - చింతపల్లి :- మండలంలోని తెలుగు ప్రజలందరూ మకర సంక్రాంతి పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య సుహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలని ఎంపీపీ కోరాబు అనూష దేవి అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ తెలుగు ప్రజలు పెద్ద పండుగగా చెప్పుకునే పతంగుల పండుగ మకర సంక్రాంతి భోగి పండుగ తో ప్రారంభమై కనుమ, ముక్కనుమతో ముగిసే నాలుగు రోజుల ఈ పర్వదినం ప్రతి ఇంట భోగభాగ్యాలు, సుఖశాంతులతో తులతూగాలని, గిరి రైతుల ఇంట వ్యవసాయ సిరులు పొందాలని ఆమె ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజలందరూ ఆమె మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: అనకాపల్లి శారదా నది రైల్వే బ్రిడ్జి మీద కశింకోట వైపు నడుచుకొని వెళ్తున్న వ్యక్తిని విజయవాడ వైపు వెళ్తున్న ట్రెన్ నెంబర్ 15630 ఢీకొనడంతో మృతి చెందాడు. బ్రిడ్జ్ మీదనుండి క్రింద పడిపోయినట్లుగా లోకో పైలెట్ ఇచ్చిన సమాచారం మేరకు జి ఆర్. పి ఎస్. ఐ కె . శాంతరామ్ ఘటనా స్థలము నకు చేరుకొని పరిశీలించారు. మృతునియొక్క వయస్సు సుమారు 60 సంవత్సరాలు, ఎత్తు 5' 7", చామానచ్చాయ రంగు, వంటిపై నీలిరంగు ట్రకు, చారలు కలిగిన లేత నీలి రంగు ఫుల్ హాండ్స్ షర్ట్ ధరించినట్లు, మృతదేహంను అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్ కు తరలించినట్లుగాను, మృతిని యొక్క ఆచూకీ తెలిసినవారు దువ్వాడ జి ఆర్ పి ఎస్. ఐ శాంతరామ్ (7673906010) ని సంప్రదించవలసినదిగా తెలిపారు.

గ్రూప్ 2 మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - చింతపల్లి :- గ్రూప్ టు విద్యార్థులకు గిరిజన సంఘం ద్వారా గ్రూప్ 2 మెటీరియల్ పంపిణీ చేయడం శుభపరిణామమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ నారాయణరావు, ఎంఈఓ ప్రసాద్ అన్నారు. గ్రూప్ 2 అభ్యర్థులకు ఉచితంగా మెటీరియల్ కృష్ణ, గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు ప్రముఖ విద్యావంతులచే ముద్రించిన ప్రశ్నావళిని చింతపల్లిలో చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు చెందిన నిరుద్యోగ గ్రూప్ టు అభ్యర్థులకు 240 ప్రశ్నావళి పుస్తకాలను ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మానపడాల్ తో కలసి యూనియన్ బ్యాంక్ మేనేజర్ నారాయణరావు, ఎంఈఓ ప్రసాద్ ల చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనం కూడా గెలవాలని గ్రూప్ 2 తోనే కాకుండా గ్రూపు 1 కూడా ఉన్నతమైనటువంటి శిఖరాలకు వెళ్లాలని అన్నారు. గిరిజన ప్రాంతంలో గతం కంటే నిరుద్యోగం పెరిగిందని, దానికి తగ్గట్టుగా ఖాళీలున్నప్పటికీ, ఉద్యోగ అవకాశాలు లేవని గిరిజన సంఘం కల్పించిన ఈ సదావకాశాన్ని అందరు ఉపయోగించుకోవాలన్నారు. పేదరికం చదువుకి ఆటంకం కాకూడదని, ఇప్పుడు ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని హిత బోధ చేశారు. సమాజంలో గిరిజన యువత మరిన్ని ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ గిరిజన సంఘం చట్టాలు, హక్కులు కోసం పోరాటం చేయడమే కాకుండా ఇటువంటి సేవా కార్యక్రమాలు కూడా చేస్తుందని కుల మతాలు, తెగలు భేదభిప్రాయం లేకుండా గిరిజలంతా ఒకటే అనే భావనతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, మాతృ భాషా వాలంటీర్ల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీను, సర్బు నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి గడతూరు సత్యనారాయణ, 230 మంది గ్రూప్ టు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ వారు మెటీరియల్ పంపిణీ చేశారు.

34వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల నిరసన

విశాలాంధ్ర - పాయకరావుపేట: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడి వర్కర్, హెల్పర్స్ చేస్తున్న నిరసన కార్యక్రమాలు ఆదివారానికి 34వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేసి అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాకర నూకరత్నం, తులసి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

అభివృద్ధికి నోచుకోని పర్యాటక ప్రదేశాలు

విశాలాంధ్ర - సీలేరు : ప్రకృతి అందాలకు పేరుగాంచిన గూడెంకొత్తవీధి మండలంలో అనేక చూడ చక్కటి ప్రదేశాలు ఉన్నప్పటికీ పాలకులు, అధికారులు నిర్లక్ష్యం కారణంగా పర్యాటక ప్రదేశాలుగా అభివృద్ధి కాలేకపోతున్నాయని భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గదుతూరి రాంగోపాల్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకో టూరిజం ప్రాజెక్టు చేపట్టడానికి లంకపాకలు, రైన్ గేజ్-సప్పర్ల, శ్రీదారాలమ్మ అమ్మవారి దేవాలయం(టెంపుల్ టూరిజం ప్రాజెక్టు), నేలజర్త దగ్గర జలపాతం, శ్రీ దారాలమ్మ అమ్మవారి దేవాలయం సమీపంలో జలపాతాలు, ఐస్ గడ్డ, సీలేరు జలవిద్యుత్ కేంద్రం సమీప ప్రాంతాలు చాలా అనుకూలంగా ఉంటాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పర్యాటక ప్రదేశాలు అంటే అరకువేలీ, వంజంగి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు, అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులు అనుకుంటున్నారు. అరకువేలీ లోని అంజోడా , అరకు వేలీ సమీపంలో గిరి గ్రామదర్శిని, పాడేరు దగ్గర గల వంజంగి అభివృద్ధి కోసం నిధులు విడుదల చేస్తున్నారన్నారు. ఎన్‌టిపిసి పరవాడ, విశాఖపట్నం 5కోట్ల నిధులను కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఫారెస్టు శాఖకు నిధులు ఇవ్వడం వలన అరకువేలీలో అటవీశాఖ, ఎన్‌టిపిసి విశాఖపట్నం వారు ఎకో టూరిజం ప్రాజెక్టు చేస్తున్నారన్నారు. వాటికంటే అందమైన ప్రదేశాలు చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాలలో ఎన్నో ఉన్నాయన్నారు. ఉదాహరణకు చాపరాయి (డుంబ్రిగుడ మండలం), మత్స్యగుండం (హుకుంపేట మండలం) అభివృద్ధి కోసం పర్యాటక శాఖ అధికారులు, ఐటిడిఎ అధికారులు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారన్నారు. ఉడా వైస్ చైర్మన్ హోదాలో బాబూరావునాయుడు మత్స్యగుండం అభివృద్ధి కోసం ఉడా నిధులు సుమారు 25లక్షల రూపాయలు మంజూరు చేసాంన్నారు. అది తెలిసి శ్రీ దారాలమ్మ అమ్మవారి దేవాలయం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని అభ్యర్ధించానని, కానీ చేయలేదన్నారు. ఈ ప్రాంతం అంటే అధికారులు, పాలకులకు నిర్లక్ష్యం, చిన్న చూపు తగదన్నారు. మీరు బాధ్యత గల ఈ ప్రాంత వ్యక్తులుగా మన ప్రాంతంలో గల పర్యాటక ప్రదేశాలు గురించి వార్తలు వ్రాయండి. అదేవిధంగా నూతన పర్యాటక ప్రదేశాలు గుర్తించి ప్రపంచానికి తెలియజేయాలన్నారు. పాలకులు, అధికారులు ఈ ప్రాంతం అభివృద్ధి పట్ల చూపుతున్న సవతి తల్లి ప్రేమను ఎండగట్టాలన్నారు.

యతిరాజుల ఆధ్వర్యంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర- పెందుర్తి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధికార ప్రతినిధి, నాయుడుతోట హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు యతిరాజుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జీవీఎంసీ 94 వార్డు అప్పల నరసయ్య కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించగా వందలాది మంది యువతలు, మహిళలు పాల్గొని అందమైన రంగవల్లులను తీర్చిదిద్దారు. ఈ పోటీలలో సేవ్ ఫార్మర్ పేరుతో తీర్చిదిద్దిన ముగ్గుకు మొదటి బహుమతి దక్కింది. విజేతకు 5000 రూపాయలు నగదును అందజేసిన నాగేశ్వరరావు ద్వితీయ, తృతీయ విజేతలతో పాటు పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. కాలనీలో భోగి మంటలు వేసి మహిళలు పాటలు పాడుతూ సందడి చేశారు. గంగిరెద్దులు ఆటలు అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కనీ వినీ ఎరుగని విదంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. మరో 20 ఏళ్ల పాటు ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రతిపక్షాలన్నీ కలిసి వైసిపిని ఓడించాలని కుట్ర చేస్తున్నాయన్న నాగేశ్వరరావు ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో జగన్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు కార్యక్రమంలో నాయుడుతోట హెల్పింగ్ హాండ్స్ సభ్యులు కంచిపాటి జగదీష్ వంకర అప్పారావు శంకర్రావు రామరాజు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి జరగాలి

విశాలాంధ్ర - చీడికాడ : రాష్ట్రానికి పట్టుకున్న కీడు తొలగి ఏపీ వెలగాలని సైకో జగన్ పోవాలి చంద్రబాబు రావాలి అంటూ మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు మండలంలోని జీ కొత్తపల్లి గ్రామంలో తెలుగు జాతికి స్వర్ణయుగం సంక్రాంతి సంకల్పం భోగి మంటల కార్యక్రమంలో చీకటి జీఓ కాపీని భోగి మంటలో వేసి నిరసనను తెలియజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైకాపా పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం ఖాయం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు కార్యదర్శి బొబ్బది తాతారావు సర్పంచ్ కొల్లి సూరినాయుడు ఎంపీటీసీ పైలా ముత్యాలనాయుడు దారపు పెద్ది నాయుడు బిలా కోటి గాడి ప్రసాద్ అమ్మతల్లి నాయుడు గండి మునలినాయుడు పాల్గొన్నారు

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన జడ్పిటిసి బాలయ్య

విశాలాంధ్ర - చింతపల్లి : తెలుగువారి లోగిళ్ళలో పతంగుల పండుగగా చెప్పుకునే మకర సంక్రాంతి పర్వదినం ప్రతి ఒక్కరి ఇళ్లలో సుఖశాంతులు, భోగభాగ్యాలు ప్రసాదించాలని జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా జనవరి మాసంలో వచ్చే మకర సంక్రాంతి పర్వదినం ప్రతి తెలుగు వారిళ్లలో పతంగుల పండు గగా, పెద్ద పండుగగా పిలుచుకుంటారన్నారు. వ్యవసాయ పంటలు ఇంటికి చేరడమే గాక ఆ కుటుంబాలన్నీ భోగ భాగ్యాలతో తులతూగాలనే ఉద్దేశంతో మూడు రోజులపాటు భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను జరుపుకోవడం జరుగుతుందని ఈ పర్వదినాలను ప్రతి కుటుంబం సుహృద్భావ వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

జీవో నెంబర్ 27 రద్దు చేయాలి : ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర - చోడవరం : అన్నదాతలను నట్టేట ముంచే ప్రభుత్వ జీవో నెంబర్.27 రద్దు చేయాలని ఏ.పీ. రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేస్తూ, ఆది వారం చోడవరంలో బస్టాండ్ ఆవరణలో భోగి మంట లో జీవో కాపీల్ని వేసారు. ఈ సందర్భంగా రెడ్డిపల్లి మాట్లాడుతూ జీవో నెంబర్.27 లోప భూయిష్టంగా ఉందని, ఈ చట్టం వల్లన స్థిరాస్తులు కలిగిన వారు, అమాయక రైతాంగం తీవ్రంగా నష్టపోతారని, రెవెన్యూ రీ సర్వే కూడా సమగ్రంగా జరగకపోవడం వల్ల సమస్యలు ఎక్కువవుతాయన్నారు. ఇప్పటికే అవినీతి రెవెన్యూ యంత్రాంగంతో అనేక భూ సమస్యలు వస్తుంటే, మళ్లీ ఈ భూ సమస్యలను పనికిమాలిన చట్టాలతో రెవెన్యూ అధికారులు చేతులో పెట్టడం సరైంది కాదని తెలియజేశారు. జీ.వో 27 చట్టం వల్ల రైతాంగం, అమాయక మధ్య తరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. తక్షణమే జీవో 27 రద్దు చేయాలని, తాత్కాలిక హైకోర్టు స్టే ని తొలగించాలని. డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సభ్యులు కామిరెడ్డి. నారాయణమూర్తి, విసరపు నాగూర్, శ్రీనుబాబు, నాగబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా గోపీనాథ్

విశాలాంధ్ర - చింతపల్లి : ఆదివాసి విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ గా వంతల గోపీనాథ్ మరోమారు నియ మితు లయ్యారు. ఆ విభాగం రాష్ట్ర చైర్పర్సన్ పాచిపెంట శాంత కుమారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భుజంగ నాయక్ బానోవత్‌ల చేతుల మీదుగా ఆయన నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ గా గుర్తించి నేడు నియామకం అందజేసిన చైర్పర్సన్ శాంతకుమారి ఉపాధ్యక్షుడు భుజం నాయక్ బానోవత్ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో మరో మారు ఆదివాసి విభాగానికి కో ఆర్డినేటర్ గా కొనసాగించడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాదిలో తనకు దక్కిన ఈ సువర్ణ అవకాశాన్ని తన ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్క తెలుగువారు సంక్రాంతి పర్వదినాన్ని సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

వైభంగా గోదా రంగనాధుల కళ్యాణం

విశాలాంధ్ర - భీమిలి : భీమిలి శ్రీ ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తేదీ. 14-01-2024 న గోదా రంగనాధుల కళ్యాణం కడు రమ్యముగా జరిగినది. ఈ కార్యక్రమం ఆలయ ట్రస్టీస్ కలిగొట్ల శ్రీరామ చంద్ర మూర్తి, కలిగొట్ల సూర్యనారాయణ మూర్తి, కలిగొట్ల భానోజీరావు, కలిగొట్ల శ్రీనివాసరావు తాతాజీ, ప్రసాద వర్మ,వారి ఆధ్వర్యంలో జరుగగా, అనంతాచార్యుల వారి పర్య వేక్షణలో,ఆలయ అర్చకులు పురాణం శేశాచార్యులు, మనోజ్, విష్ణు వారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత వైభవం గా జరిగినది.ఈ కార్యక్రమంలో భీమిలి, తగరపువలస, పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు సేవించి నారు.

నేడు జన్ మన్ ప్రోగ్రాం ప్రారంభానికి సర్వం సిద్ధం

విశాలాంధ్ర - అరకులోయ : భారత ప్రధానమంత్రి నేడు ప్రారంభించనున్న జన్ మన్ ప్రోగ్రాం కొత్త భల్లుగుడ పంచాయితీ కేంద్రంలో ప్రారంభానికి అధికారులు అన్ని విధాలుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. సభా ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. గత మూడు రోజుల నుండి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. స్టాల్స్ ఏర్పాట్లు, డిజిటల్ స్క్రీన్, సభ ప్రాంగణంలో కూర్చోడానికి కుర్చీలను ఏర్పాటు చేశారు.అలాగే స్టేజ్ సుందరంగా అలంకరించి తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారులు వి ఎస్ ప్రభాకర్, ఎం వెంకటేశ్వరరావు , గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు కే.వేణుగోపాల్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారందరికీ మకర సంక్రాంతి శుభాకాంక్షలు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి : భోగ భాగ్యాల భోగి, మకర సంక్రాంతి పర్వదినాలు ప్రతి ఇంటా భోగ భాగ్యాలతో పాటు సుఖ సంతోషాలను కలిగించాలని పాడేరు శాసన సభ్యురాలు కొట్ట గుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. ఆది వారం ఆమె మాట్లాడుతూ పెద్ద పండుగగా పేరొంది ప్రతి తెలుగు లోగిళ్ళలో భోగి, మకర సంక్రాంతి, కనుమ పర్వదినాల పేరిట మూడు రోజుల పాటు ఆనందోత్సాహాల మధ్య తెలుగు ప్రజలంతా జరుపుకునే మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాడేరు నియోజకవర్గ ప్రజలందరికీ నూతన సంవత్సర మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.

దారకొండ సంతకు సంక్రాంతి శోభ

విశాలాంధ్ర - సీలేరు : జీకేవీధి మండలం దారకొండ సంతలో ఆదివారం సంక్రాంతి శోభ సంతరించుకుంది. పండుగ సందర్భంగా చుట్టు పక్కల గిరిజన గ్రామాల నుంచి భారీ ఎత్తున గిరిజనులు దారకొండ సంతకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి కావాల్సిన నూతన వస్త్రాలు, పిండి పదార్థాలు చేసుకునేందుకు కావాల్సిన నిత్యావసరాలను కొనుగోలు చేసుకున్నారు. దీంతో సంత కిక్కిరిసి కనిపించింది.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వృద్ధుడు మృతి

విశాలాంధ్ర - చోడవరం : మండలంలోని గజపతినగరం జంక్షన్ వద్ద ద్విచక్రవాహనంపై ఇంటికి వెళు న్న చందక సన్యాసిరావు (70)ను గుర్తు తెలియని వాహనం ఆదివారం ఢీకొన్న సంఘటనలో అక్కడకక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు అంబేరుపురం గ్రామనివాసి. పొలంలో నుంచి ద్విచక్ర వాహనంపై గడ్డి తీసుకువస్తుండగా వెనకనుంచి గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడం వల్ల సన్యాసిరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఐ అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పేదలకు సంక్రాంతి కానుక పంపిణీ

విశాలాంధ్ర - గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 98 వ వార్డు కాపు వీధిలో కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సంక్రాంతి పండుగ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కర్రీ అప్పలస్వామి ఆర్థిక సహాయంతో పాటు, ఐదుగురు వృద్ధ మహిళలకు 10 కేజీలు బియ్యం, రెండు కేజీలు కందిపప్పు, రెండు లీటర్ల ఆయిల్ (వంటనూనె), కేజీ గోధుమపిండి, కేజీ పంచదార, బెల్లం, కేజీ చింతపండు, కేజీ మినప్పప్పు, సబ్బులు షాంపూలు మొదలగు నిత్యవసర వస్తువులు దుప్పట్లు, చీరలు, కాయకూరలు, స్వీట్స్ అంతేకాకుండా నగదు కూడా పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ ట్రష్టి అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ ప్రతి ఏటా వృద్ధ మహిళలకు శ్రీ కర్రీ అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ తరఫున సంక్రాంతి సందర్భంగా వారికి సహాయం అందించడం జరుగుతుందని అన్నారు. శ్రీ కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ కరోనా విపత్తు సమయంలో 108 రోజులు 98 వ వార్డు ప్రజలకు అనేక నిర్వహించింది అన్నారు ఎవరైతే కష్టంలో ఉంటారో వారిని ఆదుకోవడానికి శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ముందుంటుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కర్రీ సత్తిబాబు, సిడిగం శివ, నరవాడ ప్రవీణ్ కుమార్, కర్రీ మురళి పాల్గొన్నారు

భారతీయ సంస్కృతిని చిన్నారులకు తెలియజేయాలి

విశాలాంధ్ర - మల్కాపురం : భారతీయ సంస్కృతిని చిన్నారులకు తెలియజేయ వలసిన బాధ్యత పెద్దలపై, ఉపాధ్యాయులపై ఉందని విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రజా నాయకులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) అన్నారు. స్థానిక సింహాచలంలోని బస్ స్టాప్ వద్దగల వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శివ కుమార్ మరియు విమల దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి కళ్యాణం, గోదాదేవి వేషధారణ పోటీలను ఆయన ప్రారంభిస్తూ- సంగీతం, సాహిత్యం ,నాట్యం, గానం మొదలైన లలిత కళలను అంతా ప్రోత్సహించాలని అన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించిన శివకుమార్ ను అభినందించారు. కార్యక్రమాల్లో శ్రీకృష్ణ నృత్య భారతి ఆధ్వర్యంలో గోదాదేవి నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. నృత్య కళాకారిణి శ్రీమతి శిరీషను ప్రత్యేకంగా అంతా అభినందించారు. సాయి సూర్య మ్యూజిక్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పాశురాలను 20 మంది చిన్నారులు ఆలపించారు. సంగీత ఉపాధ్యాయురాలు శ్రీమతి లక్ష్మీ స్వాతిని సన్మానించారు. శ్రీ లలిత సంగీత శిక్షణాలయానికి చెందిన శ్రీమతి ఉగ్గిన రోజారాణి బృందంచే వీణ కచేరి నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, ఐ.ఎం.యు. ప్రతినిధులు శ్రీ బి.వి. రామలింగేశ్వర రావు, డాక్టర్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అరకులో జరుగు చంద్రబాబు సభను జయప్రదం చేద్దాం తెదేపా మండల అధ్యక్షుడు పూర్ణచంద్రరావు

విశాలాంధ్ర - చింతపల్లి : ఈనెల 20న అరకులో జరగనున్న తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు సభకు మన్య ప్రాంతం నుండి పార్టీ శ్రేణులు అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణ చంద్రరావు అన్నారు. ఆ పార్టీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపా ధ్యక్షుడు లక్కోజు నాగభూషణం, బూత్ కన్వీనర్ బేతా నాగు పలువురు పార్టీ ముఖ్య నాయకులతో కలిసి మండలంలోని సుమారు 8 పంచాయితీలలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంలో ఆ పంచాయతీలలోని పార్టీ శ్రేణులతో సమావేశమైన ఆయన అరకులో జరగబోవు పార్టీ అధినేత సభను జయప్రదం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా వైకాపా వైఫల్యాలను ప్రజలకు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఆయా గ్రామాలలో తెదేపా అభిమానులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డ నుండి పండు ముసలి వరకు కేంద్ర పథకాలు బీజేపీ కన్వీనర్ గొర్లె రామునాయుడు

విశాలాంధ్ర - పెందుర్తి : అప్పుడే పుట్టిన బిడ్డనుండి పండు ముసలి వరకు అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందని భారతీయ జనతా పార్టీ పెందుర్తి నియోజక వర్గం కన్వీనర్ గొర్లె రామునాయుడు స్పష్టం చేశారు. సబ్బ వరం మండలం బాటజంగాల పాలెం పైడివాడ అగ్రహారం పంచాయతీలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా సాగింది. ఆయా కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాము నాయుడు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ఆయా పథకాల ద్వారా ప్రజలు లబ్ది పొందాలని సూచించారు. పారిశుధ్య కార్మికులను ఘనంగా సత్కరించి వారి సేవా భావాన్ని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2028 వరకు దేశంలోని 80 కోట్ల మంది ప్రజలకు ఉచిత ఆహారాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఐదు లక్షల వరకు ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను ఇచ్చిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే సుసంపన్నభారత్ ఆవిర్భవిస్తుందని, ఆ దిశగా ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని రామనాయుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రామునాయుడును ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు అధికారులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

భోగి మంటల్లో రైతు వ్యతిరేక జీవో కాపీలు

విశాలాంధ్ర - కే కోటపాడు : జీవో నెంబర్ 27 రద్దు చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల సిపిఐ నాయకులు జీవో కాపీలను భోగిమంటల్లో దగ్ధం చేశారు. ఈ మండలం మర్రివలస గ్రామంలో రైతుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వేచలపు కాసుబాబు మండల సిపిఐ కార్యదర్శి గొర్లె దేవుడు బాబులు మాట్లాడుతూ.. ఈ చట్టం లోప భూఇష్టంగా ఉందని, ఈ చట్టం వలన స్థిరాస్తులు కలిగిన సామాన్యులు రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. భూ సర్వే కూడా సమగ్రంగా జరగకపోవడం వల్ల సమస్యలు ఎక్కువవుతాయి అన్నారు. గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా రెవెన్యూ అధికారుల వల్లనే వస్తున్నాయని, అటువంటిది మరలా ఈ సమస్యను రెవెన్యూ అధికారుల చేతుల్లో పెట్టడం సరైన విధానం కాదని అన్నారు. తక్షణమే జీవో 27ను రద్దు చేయాలని రైతు సంఘం డిమాండ్ చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి అప్పలనాయుడు, ఇల్లాకు రాము , పొంతపల్లి రామారావు , చప్పకోటి , దమ్ము ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - జీకేవీధి : సంక్రాంతి సందర్భంగా అల్లూరి సీతా రామరాజు యువజన రైతు మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కంపుమాను పాకలు గ్రామంలో దివంగత నేతలు కీర్తి శేషులు మాజీ ఎమ్మెల్యేలు ఎంవివి.సత్య నారాయణ, కొట్టగుల్లి చిట్టి నాయుడు, గొడ్డేటి దేముడు జ్ఞాపకార్థం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన రైతు మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ముక్కలి కళ్యాణి, సంఘం సభ్యులు కొర్రా సోములమ్మ, ముక్కలి మహేష్, అంపురంగి అప్పన్న, మామిడి బాలయ్య, గెమ్మెలి చంద్రయ్య, జూదూమూరు పడాల్, కొర్రా భీమన్న తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే ఎలా... రోడ్డు దాటితే ప్రమాదాలే

విశాలాంధ్ర - చోడవరం (అనకాపల్లి జిల్లా) : చోడవరం పట్టణంలోని బి.ఎస్. రోడ్డు, ప్రధాన రహదారిలో రోడ్డు మధ్యలో డివైడర్లు దగ్గర దుమ్ము, మట్టి ఇసుక పేరుకుపోయి గడ్డి వగైరాలు మొలిచి ద్విచక్ర వాహనాల వారికి మరియు పాదచారులకు తీవ్ర ఇబ్బందిని కలుగజేస్తుంది. దీంతో రోడ్డు దాటెప్పుడు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంక్రాంతి పండుగ సీజన్ దృష్ట్యా, రోడ్డు దాటినప్పుడు జారిపడిపోయే పలు ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నది. దీనిపై పలుమార్లు పంచాయతీ అధికారులు, సిబ్బందికి పలుమార్లు విన్నవించినను చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుచున్నదని గ్రామస్థులు తెలియజేశారు. కావున పంచాయతీ పారిశుధ్య అధికారులు తక్షణం స్పందించి రోడ్డు డివైడర్ మధ్యలో గల మట్టి, ఇసుకను తొలగించి, రోడ్డు ప్రమాదాలు అరికట్టవలసిందిగా పట్టణ ప్రజలు కోరుతున్నారు.

యువతను సన్మార్గంలో నడిపేవి క్రీడలే

5వ వార్డు కార్పొరేటర్ హేమలత

విశాలాంధ్ర - మధురవాడ : బృందంగా విజయ సాధనకు పరస్పర సహకారాన్ని పెంపొందించి యువతను సన్మార్గంలో నడిపేవి క్రీడ లే అని 5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత పేర్కొన్నారు. ప్రతి ఏడాదిలాగే బోట్టవానిపాలెం శివార్లలో నిర్వహిస్తున్న బొట్టవానిపాలెం ప్రీమియర్ లీగ్2024 పోటీలను ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని బోగి రోజు ఆదివారం ప్రారంభించారు. యువత సంక్రాంతి సంబరాల లో జూదం వంటి చెడు వ్యసనాల వైపు వెళకుండా వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేక్రీడా పోటీలు నిర్వహించటం శుభపరిణామమని ఆమె అన్నారు. అందరూ కుటుంబ సభ్యులతో సంతోషంగా సంక్రాంతి పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. బోగి 14తేదీ నుండి17వ తారీకు వరకు సంక్రాంతి పండుగ నాలుగు రోజులు జరిగే ఈక్రికెట్ పోటీలలో స్థానిక జట్లు మొత్తం 5 టీంలు పోటీ పడుతున్నాయని, బి.వి.పి.ప్రీమియం లీగ్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, భీమిలి టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, ఈగల రవికుమార్, నమ్మి అప్పల స్వామి, దాసరి గోవిందా, నమ్మి సూర్య అప్పారావు, కొర్రాయి మంగ రాజు, మెడబోయిన సూర్య మాస్టర్, ముగడ రమణ, దాసరి నాయుడు బాబు, కొర్రాయి సురేష్, ఇమంది అప్పల రాజు, నమ్మి పెద రమణ,బొట్ట సురేష్, కొర్రయి అప్పలస్వామి, ఈగల కిరణ్, ముగడ సత్యం, గౌతమి వెంకటి, బొట్ట అప్పలరాజు, బొట్ట కనకరాజు, నమ్మి చిన రమణ, దాసరి భాస్కరరావు మరియు బోట్టవాని పాలెం పెద్దలు, యువత పాల్గొన్నారు.